పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి


నాగోలు ఠాణాలో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

రాచకొండ సీపీ తరుణ్ జోషి

నాగోలు: పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని, ప్రజలతో మమేకమై పని చేయాలని, బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా పని వాతావరణం ఉండాలని అధికారులకు రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పోలీసు స్టేషన్లలో సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి ఆయన మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్, స్పెషల్ బ్రాంచి కంట్రోల్ రూమ్, సీడీఈడబ్ల్యూ భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో మాట్లాడి నాగోల్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు.

◆ స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించిన కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ త్వరలోనే కేంద్ర ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉన్నందువల్ల మరింత అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక శక్తుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఆదేశించారు.

◆ భరోసా కేంద్రాల ద్వారా మహిళా సంరక్షణకు మహిళల భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వారి ఫిర్యాదులపై సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిల్లల చేతిలో హింస, నిరాదరణ ఎదుర్కొంటూ పోలీస్ స్టేషన్‌కు స్వయంగా రాలేని బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ 8712662111 నంబర్‌కు లేదా..సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేకూర్చుతామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోలు సీఐ పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కుటుంబసభ్యుల హత్యకు కుట్ర

బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడి ఆరోపణ


మాట్లాడుతున్న జోగు రాములు, బాధితులు

హస్తినాపురం: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇమ్మన్నందుకు మేనత్త ఎరుకల లక్ష్మమ్మను హత్య చేసి జైల్లో ఉన్న మాదగోని రాజుగౌడ్ తన బంధువులతో మృతురాలి కొడుకులు, కోడలిని హతమార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగు రాములు ఆరోపించారు. మంగళవారం వనస్థలిపురం ఏసీపీ కార్యాలయం వద్ద బాధితులు విలేకరులతో ఎరుకల సత్తయ్య, కిరన్‌కుమార్, రాజు, పావని, సరస్వతిలతో కలిసి ఆయన మాట్లాడారు. లక్ష్మమ్మ హత్య కేసుతో రాజు గౌడ్‌తో పాటు అతడి బావలు అనంతుల శ్రీరాములుగౌడ్, జంగయ్య, కాటమయ్యలకు సంబంధం ఉందని, మృతురాలి కుటుంబ సభ్యులను కూడా చంపేస్తామని వారు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ ముగ్గురినీ కూడా పోలీసులు అరెస్టు చేయాలని జోగు రాములు, మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరుకల సత్తయ్య, కిరణ్‌కుమార్, రాజు, పావని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రేషన్, స్టేషనరీ విరాళం



దిల్‌సుఖ్‌నగర్: తుర్కయంజాల్ కాలనీకి చెందిన రఘుకుమార్ విజయలక్ష్మి అమెరికాలో ఉంటున్న తమ కుమారుడు జగదీశ్వర సాయికృష్ణ, కోడలు నిఖిత పెళ్లి రోజు సందర్భంగా మంగళవారం ఆర్‌కే పురం డివిజన్‌లోని చిత్ర లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు చేయూత అందించారు. గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో విద్యార్థులకు రూ. 48,500 విలువ గల రేషన్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ సామగ్రి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ, గృహ విద్యార్థుల కోరిక మేరకు బియ్యం, పప్పులు, ఆయిల్స్, కాలిక్యులేటర్లు, స్టేషనరీ తదితరాలను విరాళంగా అందజేశామన్నారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ దంపతులకు గృహం అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం


కిండిల్ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

హస్తినాపురం: విద్యతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తాము అన్ని విధాలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని కిండిల్ కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మేదా నందితారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహపురం కాలనీలోని కిండిల్ కిడ్స్ స్కూల్ 7వ క్రీడలు, స్కూల్ వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ నందితారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, విద్యతోపాటు విద్యార్థులకు క్రమ శిక్షణను అలవర్చే విధంగా విద్యాబోధన చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మేదా గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

సైదాబాద్ రహదారిపై నాయకుల నిరసన దీక్ష

సైదాబాద్: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చాల్సిందేనని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని, జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా కమిటీ, సైదాబాద్ ఆంజనేయస్వామి ఆలయ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఆలయం ఎదురుగా నాయకులు, భక్తులు నిరసన దీక్ష చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, స్టీల్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి తాము ఎస్‌ఆర్‌డీపీ, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆలయం పవిత్రతను దెబ్బ తీయొద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కానీ అధికారులు కొందరికి లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తూ మెజారిటీ హిందూ భక్తుల ఆవేదనకు కారణమవుతున్నారన్నారు. తమ వినతులు పట్టించుకోకుండా అధికారులు స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని వైదిక ధర్మాలకు వ్యతిరేకంగా ఆలయంపై నుంచి వెళ్లేలా నిర్మిస్తున్నారని ఆరోపించారు. నిరసన దీక్షలో పాల్గొన్న హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత మాట్లాడుతూ, అధికారులు వెంటనే స్పందించి సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్‌ను మార్చకపోతే తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. మొదట ఆలయం వద్ద నిరసనకు దిగిన నాయకులు ఎంతకీ అధికారులు స్పందించక పోవడంతో ఒక్కసారిగా వెళ్లి రహదారిపై బైఠాయించారు. దాంతో సైదాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాంతో సైదాబాద్ పోలీసులు ఆందోళనకారులతో జీహెచ్‌ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడించగా రెండు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటామని వారు హామీ ఇవ్వడంతో నాయకులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సహదేవ్‌యాదవ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, కొరుదు భూమేష్, ధర్మరాజు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి

ఎక్కడ చూసినా నీటి లీకేజీలే!

నివారణపై జలమండలి నిర్లక్ష్యం ● రోడ్లపై వృథాగా పోతున్న తాగునీరు


దిల్‌సుఖ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో..


మలక్‌పేట బాలికల జూనియర్ కాలేజీ దారిలో..

మలక్‌పేట: తాగునీటి వృథాను అరికట్టడంలో జలమండలి అధికారులు విఫలమవుతున్నారు. నీరు ఎంతో విలువైంది...జాగ్రత్తగా వాడుకోవాలి అంటూ ప్రచారం చేసే జలమండలి అధికారులు తాగునీరు రోడ్లపై వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు.

◆ మ్యాన్‌హోళ్ల వద్ద వాల్వ్ లీకేజీ, పైపులైన్ పగిలి తాగునీరు గంటల కొద్దీ రోడ్లపై పారుతోంది. సమస్య ఏర్పడి రోజులు గడుస్తున్నా అధికారుల్లో ఎలాంటి స్పందన కన్పించడం లేదు.

◆ నీటి లీకేజీలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ అస్మాన్‌ఘడ్ సెక్షన్‌లోని మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడ లీకేజీలు దర్శనమిస్తున్నాయి. వేలకొలద్దీ గ్యాలన్ల నీరు వృథా అవుతోంది.


ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ టీ జంక్షన్‌లో..

◆ ఒకవైపు లోప్రెషర్, మరోవైపు కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీటి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

◆ లీకేజీలపై అధికారులు దృష్టి సారించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి లీకేజీలు ఎక్కడెక్కడ...

◆ మలక్‌పేట బాలికల జూనియర్ కాలేజీ దారిలో, మూసారంబాగ్ – అంబర్‌పేట దారిలో, దిల్‌సుఖ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ జంక్షన్‌లో..

నీటి వృథాను అరికట్టాలి



తాగునీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉంది. రోజుల తరబడి రోడ్లపై తాగునీరు కాలువ మాదిరిగా రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులు సమస్యలపై శ్రద్ధ పెట్టరు. ప్రజలు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించరు. జలమండలి ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.
– బట్టు దాసురావు, మూసారంబాగ్

సీఐకి అభినందనలు

మన్సూరాబాద్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎల్‌బీనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులును గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి క్లాత్ బ్యాగ్‌ను బహూకరించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ట్రస్టీ సభ్యులు, నాయకులు

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆలయ ట్రస్టీ సభ్యులు, వేద పండితులు, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వీరాంజనేయస్వామి ఆలయం స్వయంభూ వెలసిందని, ప్రతియేటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వైభవంగా నిర్వహించాలని నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్టీ సభ్యులు కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ. సాదత్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బి.రవి, స్వామి, గోవర్ధన్ రెడ్డి, ఎర్ర శంకరయ్య, శేఖర్, ఆంజనేయులు, నర్సింహ, వినోద్, బాలు నాయక్, ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేశ్ సూచించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మార్చి 1వ తేదీ నుంచి అర్హులైన వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు రావాల్సి ఉండగా ఎప్పటి మాదిరిగానే బిల్లులు వచ్చాయని దీంతో జనం అయోమయంలో ఉన్నారంటూ పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తెల్ల రేషన్ కార్డున్నప్పటికీ కొందరికి రూ.వందల్లో బిల్లు వచ్చినమాట వాస్తవమేనని మున్ముందు వీటిని సరిచేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వీరు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ఒకవేళ చెల్లించినా వచ్చే బిల్లులో వారి ఖాతాలో జమ అయినట్లుగానే వస్తుందని చెప్పారు. ఇంకా ఎవరికైనా సందేహాలుంటే తెల్లరేషన్ కార్డు, ఆధార్ నంబరు, ప్రజా పాలన దరఖాస్తు రసీదు, కరెంట్ బిల్లుతో స్థానిక విద్యుత్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయండి..

మండలంలో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన మొత్తం 37 రేషన్ దుకాణాలుండగా ఏడు చోట్ల ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం మండలంలో 1135 మంది కూలీలు పనిచేస్తున్నారని ఈపథకం ద్వారా ఇప్పటికే రూ.512 కోట్లు ఖర్చు చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఓ తిరుపతిచారి తెలిపారు. గత ఆరు వారాలుగా కూలీలకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఎన్‌పీసీ క్లియర్ రాగానే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, డీఆర్‌డీఓ ఏపీడీ సక్రియానాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఐడీబీఐ బ్యాంక్ రిటైల్ అసెట్ సెంటర్ ప్రారంభం


ఎల్‌బీనగర్‌లో ఐడీబీఐ బ్యాంక్ రిటైల్ అసెట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ చల్ల ప్రవీణ్‌కుమార్

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తా సమీపంలోని శ్రీనివాస చాంబర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐడీబీఐ బ్యాంక్ రిటైల్ అసెట్ సెంటర్‌ను ఎల్‌బీనగర్ డీసీపీ చల్ల ప్రవీణ్‌కుమార్, రాచకొండ ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఐడీబీఐ బ్యాంక్ సీజీఎం, జోనల్ హెడ్ శరత్‌కుమార్, జీఎం ఎస్‌ఆర్‌హెచ్ రిటైల్ అసెట్ సెంటర్ సెంటర్ డి.సంతోష్‌కుమార్,ముఖ్యఅతిథులుగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించి వారి మన్ననలను పొందాలని సూచించారు. సీజీఎం, జోనల్ హెడ్ శరత్‌కుమార్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి ఉన్నత స్థానంలో నిలిచామన్నారు. హోం, బిజినెస్ లోన్స్ కోసం ప్రత్యేకంగా ఎల్‌బీనగర్‌లో బ్రాంచీని ప్రారంభించామని తెలిపారు. అతి తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్ వి.వాసుదేవన్, ఎల్‌బీనగర్ బ్రాంచి రిటైల్ అసెట్ సెంటర్ ఏజీఎం జి. అనిల్‌కుమార్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డాక్టర్ కావ్యకు చోటు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ కావ్య

మన్సూరాబాద్: నగరానికి చెందిన డాక్టర్ దెందుకూరి కావ్య 31 సంవత్సరాల 9 నెలల వయస్సులోనే ఎంబీబీఎస్, ఎండీ, డీఎంలతో పాటు కాలేయ వ్యాధులు, కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సల్లో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ పూర్తిచేశారు. తక్కువ వయసులో ఈ ఘనత సాధించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి సోమవారం అవార్డును అందజేసింది. ప్రస్తుతం డాక్టర్ కావ్య ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. మంగళవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాలేయ వ్యాధులు ఉన్నవారిలో దాదాపు సగం మందికి చికిత్స ఉందన్న విషయం తెలియదన్నారు. కాలేయ వ్యాధులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సి ఉందని తెలిపారు. కాలేయ మార్పిడి చేయించుకున్న వారు మారథాన్ రన్నర్లుగా ఉంటున్నారని తెలిపారు. చికిత్సతో కాలేయ వ్యాధులు నయమవుతాయన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న అడిషనల్ డీసీపీ స్వామి, ఏసీపీ వెంకన్ననాయక్

సైదాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సైదాబాద్, మాదన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది కలిసి నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. సైదాబాద్ పీఎస్ నుంచి మొదలైన పోలీసుల కవాతు సపోటాబాగ్, జాకీర్ హుస్సేన్ కాలనీ నుంచి సైదాబాద్ రహదారి .. మాదన్నపేట పీఎస్ పరిధిలోని కుర్మగూడ, ఓల్డ్ పీఎస్‌ల మీదుగా తిరిగి పూసలబస్తీ మీదుగా నాలుగు కిలో మీటర్ల మేర కవాతు పూర్తి చేసుకొని సైదాబాద్ పీఎస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ స్వామి మాట్లాడుతూ, సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో పోలీస్ బలగాలతో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి



హుడాకాంప్లెక్స్: పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఆఫీసర్ భవాని శంకర్ పేర్కొన్నారు. మంగళవారం సరూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వీప్–2024 పేరు తో బీఎల్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్, మెప్మా సిబ్బందికి ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని శంకర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా, అదేవిధంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, డీఆర్డీఓ శ్రీలత, సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ ఆదిత్య, ఆర్ఐ యాదగిరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10.30 నుంచి 11:30 వరకు...

ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీనగర్, హనుమాన టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, కుమారస్వామి టెంపుల్, పంచ ఫార్మా, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీ మాత టెంపుల్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు...

సాకేత్ డిగ్రీ కాలేజీ, సాయి డిగ్రీ కాలేజీ, స్ఫూర్తి డిగ్రీ కాలేజీ, సంతోషి మాతా టెంపుల్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ బస్‌డిపో, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాలు

మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు...

జ్ఞాన్‌దీప్ టవర్స్, కృష్ణతులసీ నగర్, ఆండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జువెల్లర్స్, నోబుల్ డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాలు

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు...

ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూ హనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి


మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఓల్డ్‌మలక్‌పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ అన్నారు. మంగళవారం ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో మహాశివరాత్రి పురస్కరించుకొని ఆయన ముద్రించిన ఉత్సవాల పోస్టర్లను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చీపురు రాజారావుగౌడ్, రామకృష్ణ, చౌకి విజయ్‌కుమార్, దయానంద్, యాదగిరి పాల్గొన్నారు.

స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం


పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ, కాలంశెట్టి లయ

నాగోలు: ఎక్కడ మహిళలు పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగోల్ డివిజన్ మహిళా నాయకురాలు కాలంశెట్టి లయ ఆధ్వర్యంలో బండ్లగూడ శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీలో నారిశక్తి వందన్ మారథాన్ రన్ ఫర్ నేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ చింతల అరుణ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమని అన్నారు. మహిళల స్థితిగతులు బాగుంటేనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు నందికొండ గీతారెడ్డి, పద్మారెడ్డి, రాధిక, సరస్వతి, ప్రశాంతి, రాజ్యలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్ గుప్తా, వరకుమార్, రావుల శ్రీనివాస్, కలంశెట్టి హరిబాబు, మనోజ్ కుమార్, శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేని తరగతి గదుల సీజ్

మన్సూరాబాద్: ప్రభుత్వ అనుమతి లేకుండా 8,9,10వ తరగతులు బోధిస్తున్నారనే ఫిర్యాదు మేరకు మన్సూరాబాద్‌లోని కృష్ణవేణి పాఠశాల తరగతి గదులను సరూర్‌నగర్ మండల విద్యాశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా 8, 9, 10వ తరగతుల్లో బోధన చేస్తున్నారని క్రైస్తవ జనసమితి ఎంఈఓ కృష్ణయ్యకు ఫిర్యాదు చేసింది. ఆయన ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న తరగతి గదులను సీజ్ చేసి పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో మెకానిక్ షెడ్ దగ్ధం


కాలిపోతున్న కారు మెకానిక్ షెడ్

నాగోలు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు మెకానిక్ షెడ్ పూర్తి కాలిపోయిన ఘటన మంగళవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. వివరాలు...నాగోలు సమతాపురి కాలనీలో పవన్ 15 ఏళ్లుగా స్నేహ మోటార్స్ పేరుతో కారు మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షెడ్డు మూసివేసి వెళ్లారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ పోయి మళ్లీ రావడంతో షెడ్‌లోని విద్యుత్ వైర్లలో సర్క్యూట్ ఏర్పడి మంటలు అంటుకున్నాయి. దీంతో ఎదురుగా ఉండే వారు గమనించి అక్కడ ఉన్న నీటితో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మంటలు అధికం కావడంతో చైతన్యపురి పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇంతలో మెకానిక్ షెడ్‌లో ఉన్న ఆయిల్ డబ్బాలకు మంటలు అంటుకొని మంటలు మరింత అధికమయ్యాయి.ఇంతలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది, హయత్‌నగర్ నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. మెకానిక్ షెడ్‌లో కొత్త విలువైన ఆయిల్ డబ్బాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంపై మెకానిక్ షెడ్ యజమాని చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 28, బెండ 50, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 21. దొండ 35, ఆలు 21, ఉల్లి 24, గోకర 40, దోస 21, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 50, మునగ 50.